# భూ సమస్యలు పరిష్కరించాలి

**షాద్‌నగర్ ఆర్డీవో సరిత**

**గ్రామాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు**

**దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు**



కేశంపేట : తొమ్మిదిరేకులలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో సరిత

కేశంపేట, జూన్ 10 : గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని షాద్ నగర్ ఆర్డీవో సరిత అన్నారు. కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆర్డీవో పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన పలు దరఖాస్తులను ఆర్డీవో పరిశీలించి మాట్లాడారు. రైతుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుందని, తద్వారా మరోమారు దరఖాస్తు చేసుకొని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరంలేదన్నారు. అదేవిధంగా తహసీల్దార్ ఆజంఅలీ మాట్లాడుతూ తొమ్మిదిరేకులలో 17, చౌలపల్లిలో 8 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నివేధిత, కంప్యూటర్ ఆపరేటర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

**సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి**

కొందుర్గు : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్ అన్నారు. మండల పరిధిలోని చింతకుంటతండా, రావిర్యాల గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. భూభారతి చట్టం ద్వారా రైతులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి కోరారు. కార్యక్రమంలో డీటీ భాస్కర్, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : మండల తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో మంగళవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని రైతు వేదిక భవనంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 153 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల రెవిన్యూ సిబ్బంది, రైతులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

**కడ్తాల్ :** ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ముంతాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏక్‌రాజ్‌గూడ, సాలార్‌పూర్ గ్రామాల్లో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్యరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులతో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరమవుతున్నాయని, ఆయా సదస్సులో రైతుల నుంచి 36 దరఖాస్తులు స్వీకరించిన్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు వాహీద్, రాజురెడ్డి, నాయకులు శంకర్‌నాయక్, శ్రీశైలం, రెవెన్యూ సిబ్బంది, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



కడ్తాల్ : సాలార్‌పూర్ గ్రామంలో రైతుల నుంచి దరఖాస్తును స్వీకరిస్తున్న తహసీల్దార్ ముంతాజ్

**యాచారం మండలంలో..**

యాచారం : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని యాచారం డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్ సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామంలో నెలకొన్న పలు రకాల భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామ మాజీ ఉపసర్పంచ్ జగన్ ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**కలకొండ, అప్పారెడ్డిపల్లిలో..**

మాడ్గుల : మండల పరిధిలోని గ్రామాల్లో తహసీల్దార్ వినయ్‌సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో రైతుల నుంచి 265 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్‌రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కొందుర్గు : దరఖాస్తులు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



ఆమనగల్లులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ లలిత



మాడ్గుల :కలకొండ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వినయ్ సాగర్

## ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు, జూన్ 10: తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కందుకూరు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నళినిమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డిజిల్లాలోని కందుకూరులో కొనసాగుతున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో ప్రవేశాలకు 2024–25 విద్యా సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు 13–06–2025 ఉదయం 11గంటలకు గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, కందుకూరు, మహేశ్వరంలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు బదిలీ ధ్రువీకరణ పత్రం, పదో తరగతిలో సాధించిన మార్కుల మెమో(2024–25), స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్స్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు(2024–25, గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతానికి చెందిన వారు రూ.2లక్షలకు మించరాదన్నారు.)ఆధార్ జిరాక్స్, స్పోర్ట్స్, అర్బన్, పీహెచ్‌సీ ధ్రువీకరణ పత్రం, మూడు కలర్ ఫొటోలు తీసుకుని హాజరుకావాలన్నారు. అందుకోసం సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశం పొందాలనుకునే వారు ఎస్టీ క్యాటగిరీకి చెందిన బాలురు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



కడ్తాల్, జూన్ 10: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి శ్రీలత హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో గల విత్తనాల షాపులను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని విత్తనాలు, ఎరువులు, వాటి నిల్వాలను ఆమె పరిశీలించారు. షాపుల్లోని విత్తనాలు పరిశీలించి వాటిని తయారు చేసిన కంపెనీల వివరాలు, ధ్రువీకరణ పత్రాలను ఆమె పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదులు అందించాలని దుకాణుదారులకు సూచించారు. షాపుల ఎదుట విత్తనాల స్టాక్ బోర్డు ప్రదర్శించాలన్నారు. అనంతరం షాపుల్లోని విత్తనాల నమూనాలను స్వీకరించి ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో షాపు యజమానులు శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్, చరణ్‌తేజ్ పాల్గొన్నారు.

## పెంచిన బస్ టికెట్ చార్జీలను తగ్గించాలి

పెద్దఅంబర్‌పేట, జూన్ 10: పెంచిన ఆర్టీసీ బస్సు టికెట్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసీ యాజమాన్యం బస్ పాస్ చార్జీలను 20 శాతం పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కేజీ నుంచి పీజీ వరకు చదువుకుంటున్న విద్యార్థులకు సైతం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ భూముల పరిశీలన



కొందుర్గు, జూన్ 10 : మండల కేంద్రంలోని సర్వే నంబర్ 150, 161లో ప్రభుత్వ భూములను జీహెచ్‌ఎంసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామునాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా సర్వే నంబర్లల్లో 150ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు తెలిసింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంట తహసీల్దార్ రమేశ్‌కుమార్ ఉన్నారు.

## పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డ్ జడ్జి లక్ష్మణ్

చేవెళ్లటౌన్, జూన్ 10: లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కారం అవుతాయని రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి కే.లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి కే.లక్ష్మణ్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ పెండింగ్ కేసులు పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో 169 కేసులు పరిష్కరించగా రూ.3,78,000 జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చంద్రనాయక్, పోలీసులు సిబ్బంది , కవిత పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

చేవెళ్ల రూరల్, జూన్ 10 : రెండు కిరాణా షాపుల్లో నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై విభాగానికి అందించిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని ధన్‌జయ్, శ్రీధర్ కిరాణ షాపుల్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. ధన్‌జయ్ షాపులో 4 క్వింటాళ్లు, శ్రీధర్ దుకాణంలో 3.5 క్వింటాళ్ల నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లై అధికారులకు అందించినట్లు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను నెరవేర్చాలి

**సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య**



జెండా ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు

చేవెళ్లటౌన్, జూన్ 10: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో భారత కమ్యూనిస్టు పార్టీ మండల మహాసభ ఆ పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి దళితులు, మైనారిటీలపైన దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి బడా బాబులకు, పారిశ్రామికవేత్తల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి పనిచేస్తుందని ఎద్దేవా చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తారనని చెప్పిన మోడీ లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేవని చెప్పడం సమంజసం కాదని, ప్రజలు చెల్లించే పన్నులు ఎక్కడ పోతున్నాయని ప్రశ్నించారు. చేవెళ్లలోని 75 వ సర్వే నంబర్‌లో రెండున్నర సంవత్సరాల నుంచి భూ పోరాట కేంద్రంలో గుడిసెలు వేసుకున్న గుడిసె వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించి పట్టాలు ఇవ్వాలని లేదా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. అనంతరం చేవెళ్ల మండల మహా సభల్లో 27 మందితో కమిటీని, 11 మంది కౌన్సిల్ సభ్యులు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సీపీఐ చేవెళ్ల మండల కార్యదర్శిగా సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎండి మక్బూల్, మంజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే. రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జే. అంజయ్య, శంకర్‌పల్లి మండల కార్యదర్శి సుధీర్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, గీత, పనివారల సంఘం మండల కార్యదర్శి కృష్ణగౌడ్, కృష్ణ, లలిత, మీనాక్షి, జయమ్మ, బాబురావు, పాపయ్య, వినోద, ఒగ్గు సత్యనారాయణ, కృష్ణాచారి, పోచయ్య, అంజిరెడ్డి, మల్లారెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

## కంపు కొడుతున్నా.. పట్టించుకోరా..



ఆరుట్లలోని వెంకటేశ్వర నగర్ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు



సుందరయ్య నగర్ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

మంచాల, జూన్ 10 : మేజర్ గ్రామపంచాయతీ అయినా ఆరుట్లలో ఎక్కడ చూసినా ప్రధాన రోడ్ల వెంట మురుగు నీరు పారడంతో ప్రజలకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. ఆరుట్ల గ్రామంలోని ఏ వీధి చూసినా భూగర్భ డ్రైనేజ్ నిండిపోయి ప్రధాన రోడ్ల వెంబడి మురుగునీరు ప్రవహించి దుర్వాసన వస్తుందన్నారు. ఈ విషయాన్ని సంబంధిత పంచాయతీ కార్యదర్శికి విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లపై పారుతున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం

కొందుర్గు, జూన్ 10 : కరాటేలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు న్యూమాంక్స్ కుంగ్ ఫూ ఆధ్వర్యంలో మంగళవారం బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ రమేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకుడు రామకృష్ణ హాజరై విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేసి మాట్లాడారు. నేటి సమాజంలో ఆత్మరక్షణకోసం కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ రాము, బాలరాజు, నందు, రాజు, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.



బెల్టులు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు

## మల్కాపూర్ వార్డు ఓట్లు కేసారంలో కలపొద్దు



మున్సిపల్ ప్రత్యేక అధికారి శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న కేసారం వార్డు సభ్యులు

చేవెళ్లటౌన్, జూన్ 10: కేసారం గ్రామ ప్రజలకు చేవెళ్లతో 70ఏళ్లుగా అనుబంధం ఉందని, మల్కాపూర్ వార్డు ఓట్లు తమ కేసారం వార్డులో కలపొద్దని కేసారం గ్రామ మాజీ సర్పంచ్ కాసుల రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులంతా మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ పూర్ణ చంద్రరావుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల విభజనలో కేసారం గ్రామంలో 889 ఓట్లు ఉన్నాయని, 600 ఓట్లు మల్కాపూర్ వార్డు నుంచి తమ వార్డులో కలపొద్దని వేడుకున్నారు. తమను చేవెళ్ల వార్డులోనే విలీనం చేయాలని వేడుకున్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సుధాకర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్, రాజుగౌడ్, రవీందర్ గౌడ్, పెంటయ్య, శ్రీకాంత్, నరేందర్‌గౌడ్, మహేందర్, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికులతో మండల విద్యాధికారి చంద్రశేఖర్

## కార్మికులు పరిశుభ్రతను పాటించాలి

**మండల విద్యాధికారి చంద్రశేఖర్**

కేశంపేట, జూన్ 10 : పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేసే సమయంలో పరిశుభ్రతను పాటించాలని కేశంపేట మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బియ్యం, కూరగాయలను శుభ్రంగా కడగాలన్నారు. వంట చేసిన తర్వాత ఆహార పదార్థాలపై మూతలను పెట్టుకోవాలని సూచించారు. సమావేశంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## గ్రామానికి దూరంగా హైటెన్షన్ లైన్ వేయాలి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పోమాల్‌పల్లి గ్రామస్తులు

కేశంపేట, జూన్ 10 : మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామానికి దూరంగా హైటెన్షన్ లైన్ వేయాలని కోరుతూ మార్చాలంటూ కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రికి పోమాల్‌పల్లి గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గోవాలోని మంత్రి నివాసానికి చేరుకున్న గ్రామస్తులు గ్రామమీదుగా వెళుతున్న 765కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ గ్రామానికి దగ్గరగా వెళుతుందని, గ్రామంతోపాటు భవానిమాత ఆలయంవద్ద ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామానికి దూరంగా లైన్ వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు భూపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నర్సింహులుయాదవ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి చేయాలి



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

షాబాద్, జూన్ 10: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఇంటింటికీ తిరిగి వారి తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం మొదటి రోజే పంపిణీ చేయాలన్నారు. డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికతతోనే ఉపాధి

పెద్దఅంబర్‌పేట, జూన్ 10: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నత ఉద్యోగాలు సొంతమవుతాయని పల్లవి కాలేజీ చైర్మన్, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 43 మంది విద్యార్థులు బహుళ జాతి కంపెనీల ఉద్యోగాలకు ఎంపికయినట్టు కళాశాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు వర్చ్యూసా, స్మార్ట్ బ్రెయిన్స్ మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికవడంపై కాలేజీ చైర్మన్, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, డైరెక్టర్ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ ఎంబీ రాజు, అడ్మినిస్ట్రేటివ్ డీన్ అంబాల శ్రీధర్, ప్లేస్మెంట్ డైరెక్టర్ విశ్వప్రకాశ్‌బాబు తదితరులు హర్షం వ్యక్తంచేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి, ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు.

## సీసీ రోడ్డు పనుల ప్రారంభం



తుర్కయాంజాల్, జూన్ 10: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ ఇందిరమ్మ కాలనీలో రూ.65 లక్షలతో సీసీ రోడ్డు పనులను మాజీ కౌన్సిలర్లు అయిలయ్య, కల్యాణ్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్మగూడ ఇందిరమ్మ కాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ మధ్య సబ్ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని ప్రజల ఇక్కట్లు తొలగించడాకి సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు వారు తెలిపారు. స్థానిక నాయకులు రాగ్యానాయక్, మోహన్‌నాయక్, రాజు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

చేవెళ్ల రూరల్, జూన్ 10 : ఆన్‌లైన్‌లో రమ్మి గేమ్స్ ఆడుతూ.. అప్పులు చేసి జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన బండి రామా మైసూర్‌రెడ్డి (43) వ్యాపారం చేస్తూ భార్య బండి మల్లికారెడ్డి (34), ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నారు. కాగా బండి రామా మైసూర్‌రెడ్డికి ఆన్‌లైన్‌లో రమ్మీ గేమ్స్‌కు బానిసై అధికంగా అప్పులు చేశాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం శంకర్‌పల్లి ఎక్స్‌రోడ్డులోని ఓ లాడ్జ్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య బండి మల్లికారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పాఠశాలలకు ఏకరూప దుస్తుల పంపిణీ



ఉపాధ్యాయులకు ఏకరూప దుస్తులను అందజేస్తున్న ఏపీడీ సూర్యారావు

కడ్తాల్, జూన్ 10: మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసిన ఏకరూప దుస్తులను మంగళవారం పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని పది పాఠశాలలకు సంబంధించిన 4,432 ఏకరూప దస్తులను ఏపీడీ సూర్యారావు ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంమయ్యేలోగా విద్యార్థులకు యూనిఫాంలను అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం బాలరాజు, ఎంఈవో సత్యనారాయణ, ఏపీఎం రాజేశ్వరి, సీసీలు రాములు, జరీనా, మల్లేశ్, వసంత, నర్సింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## అల్వాలలో 11కేవీ మరమ్మతులు

కేశంపేట, జూన్ 10 : మండల పరిధిలోని అల్వాల గ్రామంలో అల్వాలలో 11కేవీకు మంగళవారం విద్యుత్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. రెండు రోజులుగా కొందరు రైతులకు సంబంధించి వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లారని, దీంతో స్పందించిన ఏఈ వెంటనే సిబ్బందితో మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. 11కేవీ లైన్‌కు మరమ్మతులు చేయడంపట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ట్రాన్స్‌కో అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.